ఆర్టీసీ ఆఫర్.. ప్రయాణం సూపర్..

- నేటి నుంచి పంచారామాలకు ప్రత్యేక సర్వీసులు
- ఒకే రోజులో దర్శన భాగ్యం
- భక్తులకు గొప్ప కానుక
- అందుబాటులో టికెట్ ధరలు



పంచారామ దర్శిని ప్రయాణికులకు మంచినీరు అందించి పంపుతున్న ఆర్టీసీ సిబ్బంది(ఫైల్)

రామచంద్రపురం రూరల్: పవిత్ర కార్తిక మాసంలో శైవక్షేత్రాలకు భక్తులు వెల్లువెత్తుతారు. సోమవారాల్లో పంచారామ క్షేత్రాల్లోని మహాశివుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. భక్తుల సెంటిమెంటుకు ప్రాధాన్యతనిస్తూ ఆర్టీసీ ఏటా పంచారామ దర్శిని పేరుతో అందుబాటు ధరలతో ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. దీనిలో భాగంగా రామచంద్రపురం డిపో నుంచి నవంబరు 20, 27, డిసెంబరు 4, 11 తేదీల్లో కార్తిక సోమవారాల్లో భక్తులు పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటల్లో మహాశివున్ని ఒకే రోజులో దర్శించుకుని తిరిగి ఇళ్లకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు ఆయా తేదీలకు ముందు రోజు అంటే ఆదివారాల్లో నవంబరు 19, 26, డిసెంబరు 3, 10 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి, భక్తులకు సోమవారాల్లో పంచారామ క్షేత్రాల దర్శన భాగ్యం కల్పించి తిరిగి రామచంద్రపురం డిపోకు చేరకుంటాయి.

రిజర్వేషన్ సౌలభ్యం

రామచంద్రపురం డిపోతోపాటు రామచంద్రపురం, ద్రాక్షారామ, తాళ్లపాలం, మండపేట, కె.గంగవరం, అంగర, మాచవరం, రాయవరం, అనపర్తి, రామవరం, బిక్కవోలు గ్రామాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ఏజెంట్ల వద్ద పంచారామాల దర్శనానికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

39 మంది ఉంటే వారి గ్రామం నుంచే..

పంచారామ క్షేత్రాలను దర్శించుకోవాలనుకునే భక్తులు 39 మంది బృందంగా ఏర్పడి ఆర్టీసీని సంప్రదిస్తే వారి గ్రామం నుంచే బస్సు నడిపేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ముందస్తు సమాచారంతో ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఉద్యోగులు, వ్యాపారులకు..

ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలకు వారు కోరుకున్న రోజుల్లోనూ పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు నడుపడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

చార్జీల వివరాలు

భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ప్రత్యేక ప్యాకేజీ సర్వీసులుగా నడుపుతున్నారు. అల్ట్రా డీలక్స్ బస్సుల్లో పెద్దలకు రూ.1125, చిన్నారులకు రూ. 845 చార్జీలుగా అమలు చేస్తున్నారు.

టికెట్ల రిజర్వేషన్, అదనపు వివరాలకు..

రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు	99592 25536
అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ వర్మ	7382914010
కోఆర్డినేటర్ వాకతిప్ప వాసు	7382912103
కోఆర్డినేటర్ టేకుమూడి వెంకట రమణ	7382912086
బస్‌స్టేషన్ మేనేజర్ డీవీఎస్ రాజు	7382912083

ఒకే రోజులో దర్శనం



ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీలో ప్రయాణం సౌకర్యవంతంతోపాటు పూర్తిగా సురక్షితం. పంచారామ క్షేత్రాలను ఒకే రోజులో దర్శించుకునేందుకు అందుబాటు చార్జీలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ప్రత్యేక సర్వీసుల్లో భక్తుల కోసం సురక్షిత మంచినీరు, బిస్కట్లు అందజేస్తున్నాం.

–కొడమంచిలి వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్, రామచంద్రపురం ఆర్టీసీ డిపో

అభినందనీయం



కార్తిక మాసంలో పంచారామాలను భక్తులు విశిష్టంగా భావించే సోమవారాల్లో ఒకే రోజు దర్శించుకునే విధంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ సర్వీసుల ద్వారా భక్తులు పంచారామాలను దర్శించుకునే క్రమంలో ద్రాక్షారామ చేరుకునే సరికి అర్ధరాత్రి అయ్యే అవకాశం ఉంది. అయితే పంచారామ దర్శిని ద్వారా భక్తుల కోసం మా సిబ్బంది వేచి ఉండి దర్శన భాగ్యం కల్పించేలా ఏర్పాట్లు చేశాం.

–పితాని తారకేశ్వరరావు, ఈఓ, భీమేశ్వరాస్వామి దేవస్థానం, ద్రాక్షారామ

క్రికెట్ కోలాహలం

- కృత్తివెంటి గ్రౌండ్‌లో బిగ్ స్క్రీన్
- మంత్రి వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు


కృత్తివెంటి గ్రౌండ్

రామచంద్రపురం: ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ ఫైనల్‌ను తిలకించేందుకు పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణం వేదిక కానుంది. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రౌండ్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆదివార మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా టీం ఆస్ట్రేలియాతో తలపడనున్న విషయం తెలిసిందే. క్రికెట్ అభిమానులు ఈ మ్యాచ్ కోసం అతృతగా ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి వేణు నియోజకవర్గ ప్రజలు వీక్షించేందుకు భారీ స్క్రీన్‌ను కృత్తివెంటి క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారుగా మూడు వేల మంది అభిమానులు ఒకే చోట క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేలా అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో 12 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు కలిగిన ఎల్ఈడీ స్క్రీన్‌తో పాటుగా మ్యూజిక్ సౌండ్ సిస్టమ్స్‌ను మంత్రి తనయుడు నరేన్, యువసేన సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని క్రీడాభిమానులందరూ తరలివచ్చి క్రికెట్ మ్యాచ్‌ను తిలకించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో మిడ్ ప్రయోగాత్మక పరీక్షలు


మిడ్ ఎగ్జామ్ ప్రయోగాత్మక పరీక్షను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట డిగ్రీ కళాశాలను పూర్తి సాంకేతికతతో తీర్చిదిద్దుతున్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ దిశగా కళాశాలను మెరుగుపర్చుతున్నట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో శనివారం డిజిటల్ సాంకేతికతో మొదటి సంవత్సరం విద్యార్థులకు మిడ్ ప్రయోగాత్మక పరీక్షలను నిర్వహించారు. లోటు పాట్లు ఏమైనా ఉంటే మరింత మెరుగుపరిచేందుకు ఈ పరీక్షలను నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. గూగుల్ షీట్స్‌లో ప్రశ్నాపత్రం రూపకల్పనపై కంప్యూటర్ లెక్చరర్లతో చర్చించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనంద రావు, ఎగ్జామ్‌సెల్ కన్వీనర్ డాక్టర్ జి.నెహ్రూ నాయక్ తెలిపారు.

ఘనంగా జై ఆంధ్ర వార్షికోత్సవం

కె.గంగవరం: గ్రామంలో జై ఆంధ్రా సమాచార హక్కు సంఘం రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ ఆదేశాల మేరకు ఉమ్మడి తూరుగోదావరి జిల్లా లీగల్ అడ్వైజర్ ఇంజరపు రాజేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తొలుత తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా కమిటి సభ్యులు ముంగి రమేష్ బాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో జిల్లా అధ్యక్షుడు సలాది ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు మాతృవియోగం


అనంతలక్ష్మి(ఫైల్)

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్, ప్రముఖ వైద్యులు యనమదల మురళీకృష్ణ మాతృమూర్తి యనమదల అనంతలక్ష్మి(73) శనివారం రామచంద్రపురం స్వగృహంలో మృతి చెందారు. కుమారులు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం, సూరిబాబు సూచన మేరకు ఆమె కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు బృందం సేకరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పట్టణానికి చెందిన ప్రముఖులు సంతాపాన్ని తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలాజీ తదితరులు

కె.గంగవరం: అముజూరు గ్రామ సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు బాలాజీ కొబ్బరికాయ కొట్టి శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతి రైతుకు గిట్టుబాటు ధర సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుందని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, ఏఓ బలుసు రవి, సర్పంచ్ నానాపరపు కళ్యాణిశ్రీనివాస్ అన్నారు. వీఆర్వో పట్టాభి రామారావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో కేంద్రం పాత్రను వివరించాలి


డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

కపిలేశ్వరపురం(మండపేట): ప్రతి నెలా చౌకధరల దుకాణాల ద్వారా సాగుతున్న రేషన్ పంపిణీలో కేంద్రం పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తదితరులు డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రాన్ని అందజేశారు. బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనంపై ప్రధాని నరేంద్రమోదీ చిత్రాన్ని ముద్రించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువమోర్చ పట్టణ అధ్యక్షుడు బుద్ధవరపు రాజు, పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు, రూరల్ అధ్యక్షుడు రాయి వీర్రాజు, నాయకులు పి.రమణ, వెత్స ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రైతులకు చేయూత


జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతాంగానికి తగిన చేయూత లభిస్తోందని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. 70వ సహకార వారోత్సవాల్లో భాగంగా తణుకువాడ పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం తదితరులు సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతులకు అందిస్తున్న ఆర్థిక సహకారాలతోనే వ్యవసాయ రంగం ఒడిదొడుకులు తట్టుకుంటూ ముందుకు నడవగలుగుతుందన్నారు. సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓలు వేగి వెంకటసుబ్బారావు(శ్రీను), మూలారెడ్డి, కార్యదర్శి పుల్లెపు వాడపల్లి, మాజీ సర్పంచ్ డీవీ రమణ, రైతు సంఘం నాయకుడు పితాని సూరసేనుడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోశెట్టి అప్పారావు, పితాని ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్‌లోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం మాధవ్ స్థానిక విలేకరులకు శనివారం తెలిపారు. కరప మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 16వ తేదీన స్కూల్ గేమ్స్ అథారిటీ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగంలో బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్–17 రగ్బీ పోటీలకు పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వాసంశెట్టి పూర్ణతేజ, 9వ తరగతి విద్యార్థి మేడిశెట్టి జేస్వంత్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీఈటీ నాగార్జునలను హెచ్‌ఎం మాధవ్, స్థానిక పెద్దలు గుబ్బల సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్‌వీ నాయుడు, రమణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

పందుల స్వైర విహారం


గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సంచరిస్తున్న పందులు

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో పందుల స్వైర విహారం పెరుగుతోంది. వాటిని అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పందుల సంచారం ద్వారా ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. పందుల పెంపకందార్లు విచక్షణా రహితంగా వాటి సంఖ్యను పెంచుతూ గ్రామంలోనికి వదులుతున్నారు. అవి డ్రైనేజీల్లో పొర్లుతూ పరిశరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మండల పరిషత్ కార్యాలయంలోనూ, గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోనూ పందుల ఇష్టానుసారంగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల పెంపకాన్ని నిరోధించాలని పలువురు డిమాండ్ చెస్తున్నారు.

దేదీప్యమానంగా స్వామి కల్యాణం

మామిడికుదురు: ఆపద్బాంధవుడిగా, అనాథ రక్షకుడిగా పూజలందుకుంటున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణం గోగన్నమఠంలో శనివారం దేదీప్యమానంగా జరిగింది. అప్పనపల్లిలో కొలువైన స్వామి స్వయంగా తమ స్వగ్రామానికి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని భక్తులు ఆనందంతో మురిసిపోయారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవం గోగన్నమఠంలో వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కనులపండువలా జరిగింది. వేద పండితుడు జోస్యుల సోమయాజులు స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం పెట్టి కల్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు కర్తలుగా పాల్గొని బాలాజీ స్వామి కల్యాణం ఘట్టాన్ని వీక్షించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, స్థానిక ప్రముఖులు భూపతిరాజు సత్తిబాబురాజు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మామిడికుదురు: కూల్‌డ్రింక్ కోసం వచ్చిన మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన ఈదరాడలో జరిగింది. ఈ చోరీకి సంబంధించి బాధితురాలు కోన శేషారత్నం తెలిపిన వివరాలిలా.. గురువారం రాత్రి 7.50 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాపుతో శేషారత్నం కూల్‌డ్రింక్ షాపు వద్దకు వచ్చారు. ఒక వ్యక్తి బైక్ దిగి వచ్చి రూ.20 పల్పీ ఆరెంజ్ డ్రింకు తీసుకుని రూ.50 నోటు ఇచ్చాడు. డ్రింకు డబ్బులు తీసుకుని మిగిలిన చిల్లర ఇస్తుండగా ఆమె మెడలోని లాకెట్‌తో కూడిన ఆరు కాసుల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. చోరీకి గురైన బంగారం విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని శేషారత్నం వాపోయారు. బాధితురాలు శేషారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని నగరం హెచ్‌సీ పి.శ్రీదేవి శనివారం తెలిపారు. సంఘటన స్థలాన్ని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ చోరీపై సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

నేడు వేంకటేశ్వరుని జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకుల బృందం తెలిపింది. ఉదయం 5 గంటలకు స్వామికి అర్చకులచే పంచామృతాభిషేకం చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఎకరాకు 36 బస్తాల దిగుబడి


వెల్లలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో శనివారం నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎకరాకు 36 బస్తాల దిగుబడి నమోదైనట్టు మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ విలేకరులకు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో రాండమ్ పద్ధతిలో 4 పంట కోత ప్రయోగాలు చేపట్టారన్నారు. అదేవిధంగా రబీ సీజన్‌కు సంబంధించి డిసెంబరు 31వ తేదీలోపు వెదజల్లు పద్ధతి ద్వారా పంటలు వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, ఓరియంట్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


సూర్యభాస్కరరావును పరామర్శిస్తున్న పాపారాయుడు

కపిలేశ్వరపురం (మండపేట): మాతృ వియోగంతో బాధపడుతున్న ఏడిద సావరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మేడిశెట్టి సూర్య భాస్కరరావును పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు శనివారం పరామర్శించారు. ఆయనతోపాటు ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, నాయకులు ఉన్నారు.

రక్తదానం

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమానికి చెందిన 14 మంది సభ్యులు శనివారం రక్తదానం చేసినట్లు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. వివిధ కారణాల నిమిత్తం రక్తం అవసరం అయిన వారికి తమ సభ్యులు అమలాపురంలోని ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

సముద్రంలో తిరగబడిన బోటు

మామిడికుదురు: సముద్రంలో చేపల వేట ముగించుకుని తిరిగి వస్తుండగా కరవాక సముద్రంలో అన్నా చెల్లెళ్ల గట్టు వద్ద కెరటాల ఉధృతికి శుక్రవారం అర్ధరాత్రి బోటు తిరగబడింది. బోటులో ఉన్న ఆరుగురిలో సందాడి వెంకటేశ్వర్లు బోటు కింద ఉండిపోయాడు. మిగిలిన మత్స్యకారులు అతడ్ని అతికష్టం మీద బోటు నుంచి బయటకు తీసుకు వచ్చారు. వెంకటేశ్వర్లు కాలు విరిగిపోవడంతో అతడ్ని శనివారం అమలాపురం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదం నుంచి వెంకటేశ్వర్లుతో పాటు బోటు యజమాని సంగాని సోమరాజు, సురేష్, శ్రీను, రేకాడి శ్రీను, పొన్నమండ శ్రీను ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. బోటుతో పాటు ఇంజిన్ దెబ్బతిందని, వలలు కొట్టుకు పోయాయని, వేటాడిన చేపలు సైతం కొట్టుకు పోయాయయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ప్రాణనష్టం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

అంబాజీపేట: వరి పంటలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఇరుసుమండలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో రైతులు దంతులూరి వెంకట సత్యనారాయణరాజు, రాధా సూర్యనారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


రవికుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయవరం: యూటీఎఫ్ రాయవరం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం రాత్రి చేపట్టారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు చింతా వీరభద్రరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. పసలపూడి మెయిన్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన సమావేశానికి యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, కుటుంబ సంక్షేమ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి విశ్వనాథం, జిల్లా కార్యదర్శులు గరగ సీతాదేవి, రాయుడు శ్రీనివాసరావు, ఎం.ప్రదీప్, జి.రాజు, కుటుంబ సంక్షేమ డైరెక్టరు గొలుగూరి మునిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏడాదిలో యూటీఎఫ్ రాయవరం మండల శాఖ చేపట్టిన కార్యక్రమాలు, పోరాటాలను యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గొడితి మురళీకృష్ణ వివరించారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లమిల్లి భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గొడితి మురళీకృష్ణలు ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా దొంతంశెట్టి సతీష్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఏ రహమాన్, ఉపాధ్యక్షుడిగా విల్లూరి వీరభద్రరావు, మహిళా అధ్యక్షురాలిగా మానుపూడి సుబ్బలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన ఉపాధ్యాయులు కె.రవికుమార్ కుటుంబానికి రూ.3లక్షల చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణ, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి

కపిలేశ్వరపురం (మండపేట): మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండపేట పట్టణంలో శనివారం నిర్వహించిన 'ఆహా' కాంటీన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక కృష్ణా టాకీస్ ఎదురుగా ఏర్పాటు చేసిన కాంటీన్‌ను వైఎస్సార్ సీపీ యువ నాయకులు తోట పృథ్వీరాజ్ సందర్శించారు. కాంటీన్ ఏర్పాటు లక్ష్యాన్ని పురపాలక సంఘం మెప్మా విభాగం సెక్షన్ మేనేజర్ టి.అనంతలక్ష్మి వివరించారు. మున్సిపల్ కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తోట పృథ్వీరాజ్, రెడ్డి రాజుబాబు, కర్రి పాపారాయుడు, కౌన్సిలర్లు మాట్లాడుతూ ఆహా కాంటీన్ల నిర్వహణ ద్వారా సామాన్య ప్రజలకు, మహిళా సంఘాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పేదలకు తక్కువ ధరలకు ఆహార పదార్థాలను ఒడ్డించడం, ఉపాధి మార్గం దక్కుతుందని మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలం దుర్గ, శెట్టి కల్యాణి, మొండి భవాని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బాపిరాజు, నాయకులు ఎం. సుబ్రమహ్మణ్యం, దాలయ్య, పిల్లి శ్రీను, అమలదాసు లక్ష్మి, పోతంశెట్టి ప్రసాద్, పాలంగి కమల, యర్నేని ప్రభావతి, ఆలీఖాన్, బాబా, మారిశెట్టి సత్యనారాయణ, వేగుళ్ల నారాయణరావు, కంది నాగ శ్రీదేవి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కమ్యూనిటీ ఆర్గనైజర్ రమాదేవి, ఆర్పీలు పాల్గొన్నారు.

250 మందికి హోమియో మందులు


అర్తమూరులో హోమియో మందు వేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని అర్తమూరులో శనివారం ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి హోమియో మందులను అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సత్తి బుల్లిస్వామిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన 165వ శిబిరంలో రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో కళాశాల డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలోని వైద్య నిపుణులు సేవలందించారు. పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సత్తి బుల్లిస్వామిరెడ్డిని ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్ రెడ్డి, గ్రామ ప్రముఖులు గొలుగూరి భాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణ, మండ గోవింద్ రెడ్డి, సుమలత అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ తాడి కోదండ రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కపిలేశ్వరపురం: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని కపిలేశ్వరపురం గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ప్రతిభా పోటీల పరిశీలకులన్నారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్, ఆబ్జెక్టివ్ పోటీలను నిర్వహించారు. 62 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారని, వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.